క్లుప్తంగా

ఆస్తి పన్నుపై రాయితీ సద్వినియోగం చేసుకోవాలి

భైంసాటౌన్: పట్టణంలోని గృహ, వ్యాపార, వాణిజ్య సముదాయ యజమానులు ఆస్తిపన్నుపై రాయితీ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఏప్రిల్ 30లోగా చెల్లించిన వారికి 5 శాతం మినహాయింపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 2023–24 వరకు ఆస్తి పన్ను బకాయిలు చెల్లించిన వారు అర్హులని తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని.. సకాలంలో పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన


మంగళహారతులతో వెళ్తున్న మహిళలు

లోకేశ్వరం: మండలంలోని హవర్గా గ్రామంలో బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం విగ్రహాల ఊరేగింపు, గణపతిపూజ, పుణ్యాహవచనం, అంకురారోహణం, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, దిక్పదేవతాస్థాపన, సాయంత్రం ఆరాధన, నిత్యవిధి, జలాదివాసం, పుష్పాదివాసం, ఫలాదివాసం, ధాన్యాదివాసం, శయ్యాదివాసం కార్యక్రమాలను పండితులు కాల్వ రాములు జరిపించారు. బీరప్ప ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే వ్యాఖ్యలు అర్థరహితం'

ఖానాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితమని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ అన్నారు. మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిర్మల్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండని ఎమ్మెల్యే.. ప్రజాప్రభుత్వాన్ని కూల్చివేస్తామన్న వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం ఇచ్చిన రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు. సమావేశంలో నాయకుడు షమీ ఉన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ నేతల రాజీనామా

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు మంగళవారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. గ్రామానికే చెందిన సత్తన్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ ఆమంద శ్రీనివాస్‌తోపాటు బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు టేకు మధు, వీడీసీ నాయకుడు మోతె రాజలింగు, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు నూనె నర్సింగరావు, తుదిగేని రాజలింగు, సైకిలాబ్, ఆమంద మహేశ్, బానావత్ కుమార్, నగేశ్, ఈబిది పవన్, రాజు, నరేశ్, రాజేందర్, రమేశ్ తదితరులు ఆయా పార్టీలకు రాజీనామా చేశారు. తాము ఏయే పార్టీలో చేరే విషయం త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

తానూరు: మండల కేంద్రంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో మంగళవారం దివ్యాంగులైన విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. 22 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి మంగళవారం భవిత విద్యావనరుల కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని.. దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఆర్‌టీ భూమన్న, రాము సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీకే మా మద్దతు'


మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: దళిత డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ పార్టీకే పార్లమెంట్ ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెల సిద్దార్థ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం పార్టీ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో ఇప్ప లావణ్య, సటి సాయన్న, సూర్యకాంత్, మసూరి అర్చన, లక్ష్మణ్, గోవింద్ తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత

కుంటాల: కుంటాలకు చెందిన వన్నెల సావిత్రి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. మంగళవారం మండల కేంద్రానికి చెందిన శ్రీరాంవార్ రాణి–గజేందర్ (పీఆర్వో) దంపతులు రూ.మూడు వేల నగదును బాధితురాలికి అందించి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో రాజు, రమేశ్, మాధవ్‌రావు, ఉదయ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వార్షికోత్సవం


ఎల్లమ్మతల్లి ఉత్సవ విగ్రహంతో ఊరేగింపులో భక్తులు


బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు


ఆలయం వద్ద ఎమ్మెల్యే బొజ్జు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ, నాయకులు

పట్టణంలోని గోదావరి తీరంలో ఉన్న రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం పట్టణంలోని వివిధ కాలనీల భక్తులు బోనాలు ఎత్తుకొని ఆలయానికి తరలివచ్చారు. అనంతరం అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. అంతకుముందు ఊరేగింపులో బైండ్లోళ్ల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు అలరించాయి. ఈసందర్భంగా ఖానాపూర్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ హాజరై పూజలు చేశారు. భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, రమేశ్, ఆలయ కమిటీ సభ్యులు చిన్ననర్సాగౌడ్, బుర్ర రాజారాంగౌడ్, అమరవేణి శంకర్‌గౌడ్, వెంకాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. – ఖానాపూర్

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

కుంటాల: రైతులు తమ పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని భైంసా ఏడీఏ వీణ పేర్కొన్నారు. మంగళవారం కుంటాలలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. అనంతరం పీఏసీఎస్ సంఘ భవనంలో ఎరువుల నిల్వలను తెలుసుకున్నారు. ఏఈవో మహేశ్, ఆత్మ బీటీఎంలు ప్రవీణ్, సందీప్ ఉన్నారు.

అంబకంటిలో ప్రారంభం..

కుంటాల మండలంలోని అంబకంటి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఈవో నాగభూషణం ప్రారంభించారు. సెక్రెటరీ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది మహేశ్, కృష్ణ, గజేందర్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లిలో మల్లాపూర్, రాచాపూర్, బాబాపూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఈవోలు ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పంటను అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు ఉమామహేశ్వరి, పవిత్ర, సంతోష్, సెంటర్ నిర్వాహకులు రజనీకాంత్, లింగారెడ్డి, అశోక్, శంకర్, నరేశ్ రైతులు పాల్గొన్నారు.


కుంటాల: వివరాలు పరిశీలిస్తున్న ఏడీఏ వీణ

దిలావర్‌పూర్: మండలంలోని గుండంపల్లి, సిర్గాపూర్ గ్రామాల్లో మంగళవారం గ్రామైఖ్య సంఘాల ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏవో స్రవంతి, ఏపీఎం సులోచన ప్రారంభించారు. దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయించాలని వారు సూచించారు. సీసీలు ముత్యం, పోశెట్టి సాయన్నతోపాటు స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.


లక్ష్మణచాంద: మల్లాపూర్‌లో..


దిలావర్‌పూర్: గుండంపల్లిలో కేంద్రం వద్ద..

బాధిత రైతులకు పరిహారం అందించాలి

దిలావర్‌పూర్: మండలంలోని గుండంపల్లి గ్రామంలో సాగు చేసిన మొక్కజొన్న పంట(నూజివీడు కంపెనీ)కు తీవ్ర నష్టం వాటిల్లిదంటూ సదరు కంపెనీ నుంచి ప్రభుత్వం పరిహారం అందించాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు. మంగళవారం గ్రామంలోని రైతువేదిక వద్ద రైతులు ఏవో స్రవంతికి వినతిపత్రం అందజేశారు. రైతులు చిన్నారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, భోజారెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలో యాసంగిలో నూజివీడు సీడ్స్‌కు చెందిన 700 బ్యాగుల మొక్కజొన్న విత్తనాలను సాగు చేసినట్లు పేర్కొన్నారు. కంకి దశలో ఉండగానే సుమారు 200 ఎకరాల్లో ఎండుతెగులు సోకి పంట ఎండిపోయిందని వాపోయారు. ఏవో పరిశీలించి కంపెనీ ప్రతినిధులకు తెలపడంతో వారు వచ్చి పంటను పరిశీలించారు. రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ప్రతినిధులు వెల్లడించారు.


పంటలు పరిశీలిస్తున్న ఏవో స్రవంతి

ఉదయమే ఉపాధి పనులకు రావాలి

- డీఆర్డీవో విజయలక్ష్మి

భైంసారూరల్: ఉదయమే ఉపాధి పనులకు వచ్చి.. ఎండలు పెరగకముందే కూలీలు పనులు పూర్తి చేసుకొని ఇళ్లకు వెళ్లాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను డీఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో మాట్లాడారు. రోజురోజుకు ఎండలు పెరుగుతున్నందున జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పని ప్రదేశం వద్ద కూలీలకు టెంట్‌సౌకర్యం, తాగునీరు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఉపాధికూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించారు. ఆమె వెంట ఈజీఎస్ ఏపీఓ శివలింగం, ఈసీ రాజేశ్వర్, కూలీలు తదితరులు ఉన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

ఉపాధి పనులపై అవగాహన

తానూరు: జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పని కల్పించాలని ఏపీవో గంగాధర్ సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయా గ్రామాల టీఏ, ఎఫ్ఏలకు ఉపాధి పనులపై అవగాహన కల్పించారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

- ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్

కుభీర్: కార్యకర్తలు సైనికుల్లా పని చేసి ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి జి.నగేశ్‌ను గెలిపించాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలాజీ జిన్నింగ్ ఫ్యాక్టరీలో బీజేపీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తనకు లక్ష ఓట్లు వేయించి ముధోల్ చరిత్రలో మొదటిసారి బీజేపీ ఎమ్మెల్యేను గెలిపించారని.. అంతకంటే ఎక్కువ మెజార్టీ ఎంపీ ఎన్నికల్లో తీసుకురావాలని కోరారు. జిల్లా కార్యదర్శి పడిపెల్లి గంగాధర్, మండల అధ్యక్షులు ఏశాల దత్తాత్రి, రమేశ్, మాజీ ఎంపీపీ సావుల మల్లన్న, కోఆప్షన్ సభ్యులు దత్తాహరి, నగేష్, లక్ష్మణ్, వెంకట్రావ్ పటేల్, గులాబ్, సాయినాథ్, కనకయ్య, గులాబ్, శంకర్ ఉన్నారు.


కుభీర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావ్

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

తానూరు: బీజేపీ ఎంపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే రామారావ్ పటేల్ సూచించారు. మండల కేంద్రంలోని కల్యాణమండపంలో నిర్వహించిన బీజేపీ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వై.చిన్నారెడ్డి, శివాజీపటేల్, బాలాజీ పటేల్, లక్ష్మణ్‌రెడ్డి, నాగనాథ్, కమలాకర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ముధోల్: మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై మంగళవారం ఎస్సై సాయికిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో డబ్బులు, మద్యం రవాణా అయ్యే అవకాశం ఉండడంతో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

భైంసారూరల్: మండలంలోని మిర్జాపూర్ గ్రామం వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనాల తనిఖీ చేపడుతున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

పోరాట యోధుడు సర్వాయి పాపన్నకు నివాళి

భైంసాటౌన్: పట్టణంలోని గురుకృప కళాశాలలో మంగళవారం సర్వాయి పాపన్నగౌడ్ 135వ వర్ధంతి నిర్వహించారు. తెలంగాణ గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారం కోసం పోరాడిన యోధుడు సర్వాయి అని కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ముధోల్ నియోజకవర్గ అధ్యక్షుడు పండితరావు పటేల్, భైంసా పట్టణ విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు డాక్టర్ మహిపాల్, మున్నూరు కాపు మిత్రమండలి అధ్యక్షుడు కాశీనాథ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.


భైంసాలో నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: బహుజనుల సమస్యలపై పోరాడిన సర్వాయి పాపన్న గౌడ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని గౌడ సంఘం నాయకులు పేర్కొన్నారు. పాపన్న వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గెరిల్లా పోరాటంతో వరంగల్ కోటను జయించిన వీరుడు పాపన్న అన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం జాతీయ నాయకులు నర్సాగౌడ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


నిర్మల్‌లో నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

కామ్రేడ్ కిరణ్ ఆశయ సాధనకు కృషి

నిర్మల్‌చైన్‌గేట్: ఐఎఫ్‌టీయూ నాయకులు, తెలంగాణ ప్రొగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ కిరణ్ ఆశయ సాధనకు పోరాడుదామని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న అన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్‌భవన్‌లో కిరణ్ సంతాప సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ కిరణ్ ఆటోరంగ కార్మికులకు ఇంటిస్థలాలు, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని పోరాటం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గంగామణి, లక్ష్మి, కమల, చిట్టి, వసంత, కవిత పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

పంటలు పరిశీలించిన శాస్త్రవేత్తలు

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో మంగళవారం ముధోల్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు మొక్కజొన్న పంటలను పరిశీలించారు. నేల స్వభావం, నీటితడులు, సస్యరక్షణ చర్యలు, దిగుబడి, వ్యయం వివరాలు తెలుసుకున్నారు. అనంతరం హైబ్రిడ్ సాగు విధానంలో పాటించాల్సిన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ముధోల్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కార్తీక్, కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు మంజులత, ఉషారాణి, శ్రావణి, తిమ్మాపూర్ ఏఈఓ శ్రీలత, రైతులు ఉన్నారు.

తరోడాలో..

ముధోల్: మండలంలోని తరోడా గ్రామంలో ముధోల్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలకు రైతులకు హైబ్రిడ్ మొక్కజొన్న పంట సాగు చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు కార్తీక్, మంజులత, ఉషారాణి, శ్రావణి తదితరులు ఉన్నారు.


భైంసారూరల్: చేను వద్ద శాస్త్రవేత్తలు

మస్కాపూర్ విద్యార్థి ప్రతిభ

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి సాడిగె విజ్ఞాన్‌సాయి సీవోఈ పరీక్షలో ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం నరేందర్‌రెడ్డి తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సొసైటీ ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ గురుకులాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షలో విద్యార్థి ప్రతిభ కనబర్చి సీటు సాధించాడన్నారు. విద్యార్థిని ఎంపీటీసీ స్వప్నతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

బోరుకు మరమ్మతులు

ఖానాపూర్: పట్టణంలోని ఏడో వార్డు ప రి ధిలో ఉన్న పద్మావతినగర్‌లో బోరు చెడిపో యి తాగునీటి సమస్య తలెత్తింది. దీంతో కౌన్సిలర్ కిశోర్ నాయక్ సమస్యను మున్సి పల్ చైర్మన్ సత్యం దృష్టికి తీసుకెళ్లడంతో వా రు స్పందించి బోరు మోటారుకు మరమ్మతులు చేయించారు. కమిషనర్ మనోహర్ తదితరులు ఉన్నారు.

క్షేత్రపర్యటనలో కొరిటికల్ విద్యార్థులు

మామడ: మండలంలోని కొరిటికల్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఎక్స్‌పోజర్ విజిట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం శ్రీరాంసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో జల విద్యుత్ తయారీ గురించి ప్రాజెక్ట్ ఇంజినీర్ రామకృష్ణ విద్యార్థులకు వివరించారు. మాడేగాం వద్ద భగీరథ ప్లాంట్, నీటిని శుద్ధి చేయు విధానం పరిశీలించారు. అనంతరం కిసాన్‌స్ఫూర్తి రైతు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. సేంద్రియ ఎరువుల తయారీని ఏవో ప్రవీణ్‌కుమార్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రాజెక్ట్ వద్ద పాఠశాల విద్యార్థులు

నర్సరీలు పరిశీలన

సోన్: నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించాలని జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి గోవింద్ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని గాంధీనగర్, మాదాపూర్ గ్రామాల్లో నర్సరీలను, పల్లె ప్రకృతివనాలు, వైకుంఠధామాలను ఎంపీడీవో సురేశ్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ మంజులరెడ్డి, కార్యదర్శులు సంగీత, గోపాల్, ఎఫ్ఏలు ముత్యం, కళావతి పాల్గొన్నారు.


గాంధీనగర్‌లో పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ గోవింద్

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

లక్ష్మణచాంద: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్ పేర్కొన్నారు. లాభార్థి సంపర్క్ అభియాన్‌లో భాగంగా మంగళవారం మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ)లో ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈసందర్భంగా కరపత్రాలు అందించి మాట్లాడారు. మూడోసారి ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపడితేనే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఎ గోవర్ధన్, జీవన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ముత్యంరెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ మండలంలో..

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వ, కాల్వతండా, సిర్గాపూర్, మాయాపూర్, బన్సపల్లి, కంజర్ గ్రామాల్లో బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. లాబార్థి సంపర్క అభియాన్‌లో భాగంగా గ్రామాల్లో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించినట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పీసరి శైలేశ్వర్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఉంగరాల రాజు, ఆయా గ్రామాల బూత్ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


నర్సాపూర్(డబ్ల్యూ)లో మాట్లాడుతున్న రాంనాథ్

'కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి'

నిర్మల్‌టౌన్: ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. పంటలకు రూ.500 బోనస్, రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీని ఒకేసారి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు రాంకిషన్‌రెడ్డి, లోలం శ్యాంసుందర్, సుభాష్‌రావు, రాము, తదితరులు ఉన్నారు.


కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు